క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలకు సన్మానం



అరకు పార్లమెంట్, పాడేరు నియోజకవర్గ సమన్వయకర్తలు భాగ్యలక్ష్మి, విశ్వేశ్వరరాజులను సన్మానిస్తున్న నేతలు

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్తగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్తగా ఎస్టీ కమీషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజులను పార్టీ అధిష్ఠానం నియామకంపై మండల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ సమష్టిగా పనిచేద్దామని వారు పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఔదార్యం



బాధిత కుటుంబానికి బియ్యం తదితర సామగ్రి అందజేస్తున్న నాయకులు

కూనవరం: అయ్యవారిగూడెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటనలో సర్వం కోల్పోయిన బాధితురాలు పైదా సీతమ్మను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదుకున్నారు. ఈ మేరకు బాధితురాలి కుటుంబానికి పార్టీ మండల కార్యదర్శి పునుగుపాటి భరతమూర్తి, కూనవరవు వెంకట్రావు 50 కిలోల బియ్యం, దుప్పట్లు, టార్పాలిన్‌లను అందజేశారు. వారు మాట్లాడుతూ బాధితురాలికి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామని చెప్పారు.

ఇంటింటికీ ఆరోగ్యశ్రీ కార్డులు



చెరకుంపాలెంలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో విజయ రంగారావు

రాజవొమ్మంగి: ప్రతి ఇంటికి నూతన ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల పంపిణీ చురుగ్గా జరుగుతుందని ఎంపీడీవో విజయ రంగారావు తెలిపారు. ఆయన శనివారం పలు గృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులకు స్వయంగా ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. అంతకు ముందు పంపిణీలో అనుసరించాల్సిన అంశాలను ఆయన వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి వివరించారు. ఏపీలో ఆరోగ్య శ్రీ చికిత్సల వ్యయ పరిమితి రూ.25 లక్షలకు పెంచిన నేపథ్యంలో ఈ కార్డులు పంపిణీ ప్రాధాన్యత సంతరించుకొందన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను కూడా ప్రభుత్వం ప్లే స్టోర్‌లో అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రస్తుతం వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కార్డులు పంపిణీ చేయడంతో పాటు ఉచిత వైద్య సేవల విషయాలను వివరిస్తున్నట్టు చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం పొందేందుకు ఆరోగ్య శ్రీ ఒక వరం అన్నారు. మండలానికి ఇప్పటివరకు 7,550-ఆరోగ్యశ్రీ, 8,720 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల పంపిణీ జరిగినట్టు చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతికి సంతాపం


ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త పాంగి సౌభాగ్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి విశాఖ కేజీహెచ్‌లో మృతి చెందారు. ఆమె మృతికి సీఐటీయూ మండల కార్యదర్శి శంకరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు శనివారం నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నేడు సీతారాముల తీర్థం

కొయ్యూరు: మండలంలోని తాళ్లపాలెంలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. మండలంలో జరిగే సంక్రాంతి తీర్థాల్లో పెద్ద తీర్థంగా పేరొందిన ఈ ఉత్సవానికి మండలంలోని గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరవుతారు. ఏటా సంక్రాంతి నుంచి ఆరు రోజుల తర్వాత తీర్థాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఆదుకుంటున్న 'ఉపాధి'

- గ్రామాల్లోనే పనులు
- వలసలకు స్వస్తి పలికిన కూలీలు
- కోట్లాది రూపాయల ఉపాధి వేతనాల చెల్లింపులు



అనంతగిరి: జాతీయ ఉపాధి హామీ పథకం గిరిజనులకు వరంగా మారింది..టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు ఉపాధి లభించక కూలి కోసం ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు తరలివెళ్లేవారు.. కుటుంబమంతా కష్టపడినా రోజు గడవని పరిస్థితి ఉండేది... టీడీపీ పాలకులు కనీసం పట్టించుకోవకపోవడంతో గిరిజనుల బతుకులు దయనీయంగా ఉండేవి.. అదంతా గతం..ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉపాధి పథకం ద్వారా అర్హులందరికీ 100 రోజులు పనులు చేసుకునేలా చర్యలు చేపట్టింది. దీంతో తమ గ్రామాల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అనంతగిరి మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా అనేక గిరిజన కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. వ్యవసాయ పనులు లేని రోజుల్లో కూలీలు ఇబ్బందులు పడాల్సివచ్చేది. భూమి చదును, చెరువులు, నీటి నిల్వ కందకాలు, పండ్లతోటలు పెంపకాలు, చెత్తసంపద కేంద్రాల పనులతో గిరిజన రైతులకు మేలు జరుగుతుంది. ఉపాధి హామీ పథకంలోని సగటున ఒక్కో కూలీకి సగటున 60 రోజులు పని కల్పించారు. ఒక్కో కూలీకి రూ.260 చొప్పున చెల్లించారు. అర్హులందరికీ జాబ్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. దీంతో గిరిజన రైతులు తమ సొంతపనులే గాక ఉపాధిపనులు చేసుకుంటూ లబ్ధిపొందుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



పండ్ల మొక్కలు నాటుతున్న కూలీ



పొలం వద్ద నీటి నిల్వ గుంతలు తవ్వుతున్న కూలీలు

మండలం: అనంతగిరి	
2023-24 సంవత్సరానికి ఉపాధి పథకం వివరాలు:	
జాబ్‌కార్డులు	12,724
మొత్తం కూలీలు	25,700
పనులు కల్పించిన జాబ్‌కార్డులు	11,896
ఉపాధికి అర్హులైన కూలీలు	22,896
పనిదినాలు	9,04,631
వేతనాల చెల్లింపులు	రూ.23.52 కోట్లు



బొర్రాలోని భూమి చదును చేస్తున్న కూలీలు

ఉపాధి పనులతో భరోసా



ఉపాధి పథకం మా లాంటి నిరుపేదలకు ఎంతో ఆదుకుంటుంది. మా గ్రామంలో ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. వంద రోజులు పనిదినాలతో లబ్ధిపొందాను. పనులకు వేర్వేరు ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి పథకం భరోసా ఇస్తుంది.

– విశ్వనాథం, పెదబయలు

రూ.23.52 కోట్ల చెల్లింపులు



ఉపాధి పథకం ద్వారా ఇప్పటి వరకు కూలీలకు వేతన రూపేణా రూ.23.52 కోట్లు చెల్లింపులు జరిగాయి. మెటీరియల్‌తో పాటు పనుల రూపేణా వేతనం అందజేశాం. గ్రామీణ ప్రజలకు ఈ పథకం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. మండల ప్రజలు ఈ పథకంతో ఎంతో మేలు జరుగుతుంది.

– అర్జున్, ఏపీవో, అనంతగిరి

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



పెదబయలులో మాట్లాడుతున్న ట్రైనర్ పూర్ణయ్య

పెదబయలు: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ప్రాదేశిక సభ్యులు, ఉప సర్పంచ్‌లు తదితరులకు పంచాయతీ అభివృద్ధి పనులపై ప్రణాళిక తయారీ విధానంపై శనివారం మాస్టర్ ట్రైనర్ ఎల్.పూర్ణయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం సమగ్ర ప్రణాళిక తయారు చేయుటకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల అనుగుణంగా వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమానికి ఎంపీపీ బొండా వరహాలమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులకు ఎంతో అవసరమన్నారు. ఎంపీడీవో విగ్గిన్స్, ఈవోపీఆర్డీ నర్సింగరావు, వైస్ ఎంపీపీలు రాజబాబు, సోనె, అధికారులు,సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు,ఉప సర్పంచులు పాల్గొన్నారు.

35 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలందిస్తున్న 104 సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని ఆదివాసీ తండా అప్పలరాజుపేటలో శనివారం 104 వాహనం ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 35 మందికి ఉచిత వైద్య సేవలు అందజేసినట్టు 104 డీటీఓ శ్రీనివాస్ తెలిపారు. బీపీ సుగర్ వ్యాధి గ్రస్తులను గుర్తించి అవసరమైన మందులు అందజేశారు. చిన్న పిల్లలు, గర్భిణులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ రామారావు, హెచ్‌వీ లక్ష్మి, ఏఎన్‌ఎం భవానీ, ఆశ రత్నం, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మయ్య, పైలెట్ కనకరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



చింతపల్లి పరీక్ష కేంద్రంలో విద్యార్థులు, పర్యవేక్షిస్తున్న అధికారులు



కొయ్యూరులోని పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



కూనవరం పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎంఈవో-2 లక్ష్మయ్య

కొయ్యూరు: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు శనివారం అల్లూరి జిల్లాలో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. పరీక్షను విద్యా శాఖ అధికారులు తనిఖీలు చేశారు. కొయ్యూరు మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో జరిగిన పరీక్షకు గొలుగొండ, కొయ్యూరు మండలాలకు చెందిన 155 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు సీఎల్‌వోగా నవోదయ కేంద్రం నుంచి వచ్చిన శ్రీరామ్ వ్యవహరించారు. హెచ్ఎం భక్త వత్సల మూర్తి ముఖ్య పర్యవేక్షకునిగా వ్యవహరించారు.

చింతపల్లిరూరల్: నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు డిప్యూటీ డీఈవో ఎస్.చల్లాయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన నవోదయ పరీక్షకు 187 మంది విద్యార్థులకు 138 మంది హాజరైనట్టు చెప్పారు. ఎంఈవోలు పవన ప్రసాద్, బోడేం నాయుడు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షకు 196 మంది విద్యార్థులకు 115 మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ చిచ్చడి బాబూరావు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ-2 లక్ష్మయ్య సందర్శించి, పర్యవేక్షించారు. సెంటర్ లెవెల్ అబ్జర్వర్‌గా హెచ్ఎం చిచ్చడి అప్పారావు వ్యవహరించారు.

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల పరీక్షా కేంద్రంలో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు 91 మంది విద్యార్థులు హాజరైనట్టు ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలియజేశారు. 240 మంది విద్యార్థులకు 91 మంది మాత్రమే హాజరైనట్లు ఆయన తెలిపారు. ఎంఈవో కె.తాతబ్బాయిదొర పరీక్షా కేంద్రాన్ని సందర్శించి తనిఖీలు చేశారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్టు ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు.



పి.యర్రగొండలో పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన పరిశీలిస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర

వైద్య సేవలు వినియోగించుకోవాలి

అడ్డతీగల: ప్రభుత్వం అందుబాటులోనికి తీసుకువస్తున్న వైద్య సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని దుప్పులపాలెం వైద్యాధికారి ఎం.స్పందన అన్నారు.అడ్డతీగల మండలం సోమన్నపాలెం, ఉలిగోగుల గ్రామాల్లో శనివారం జన్‌మన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు సూచనలు, పిల్లలకు సీజనల్‌గా సంక్రమించే వివిధ రుగ్మతలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. 62 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా పలువురుకి ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. రంపచోడవరం డివిజన్ 104 డివిజనల్ మేనేజర్ ఎం.సతీష్‌కుమార్, దుప్పులపాలెం పీహెచ్‌సీ, 104 సిబ్బంది పాల్గొన్నారు.



ఉలిగోగులలో ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసి సూచనలిస్తున్న వైద్యాధికారి స్పందన

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగనన్న ధ్యేయం



ఎటపాకలోని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న ఏపీఎం ఆదినారాయణ

ఎటపాక: ఎన్నికల ముందు అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని గుండాల ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి అన్నారు. పినపల్లి జెడ్పీ హైస్కూల్‌లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులు, నిధుల వివరాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలతో ఏపీఎం స్వామి ,ప్రజాప్రతినిధులు మాట్లాడారు. సచివాలయం పరిధిలోని రెండు పంచాయతీల్లో 84 సంఘాలకు మూడు విడతలుగా రూ.1.99కోట్ల నగదు జమ కాగా, నాలుగవ విడతగా రూ.66.36లక్షలకుపైగా నిధులు విడుదల కానున్నట్టు తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన చేస్తున్నారని , ఇచ్చిన ప్రతీ హామీనీ నెరవేర్చారని ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఉప సర్పంచ్ శశికుమార్, సచివాలయ కన్వీనర్లు నర్సింహరావు, సురేష్, రాము, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

25న వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో ఈనెల 25న నిర్వహించనున్న కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి వైఎస్సార్ ఆసరా పథకం నాలుగవ విడత చెక్కును డ్వాక్రా సంఘాలకు అందజేయనున్నట్లు వెలుగు ఏపీఎం ఆదినారాయణ తెలిపారు. ఆయన శనివారం స్త్రీ శక్తి భవనంలో ఎంఎంఎస్ ఉపాధ్యక్షురాలు చిర్లం దేవి అధ్యక్షతన జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి హాజరుకానున్న సమావేశానికి పెద్ద ఎత్తున మహిళా సంఘ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యక్షురాలు దేవి మాట్లాడుతు మన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రతి డ్వాక్రా మహిళ తీసుకొన్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేసి అక్క చెల్లెమ్మలకు ఎంతో మేలు చేశారన్నారు. గడచిన మూడు విడతల ఆసరా సొమ్ముతో కలిపి మండలానికి మొత్తంగా రూ.12.7 కోట్ల మేర డ్వాక్రా సంఘాలకు రుణ విముక్తి కలిగిందన్నారు. నాలుగవ విడతగా విడుదలైన రూ. 2.7 కోట్ల చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. మండలవ్యాప్తంగా గల 759 పొదుపు సంఘాలకు చెందిన 7,149 మంది సభ్యులు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణవిముక్తి పొందుతున్నారని వివరించారు. గ్రామసమాఖ్య లీడర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు



కొయ్యూరు-బూదరాళ్ల జట్ల మధ్య జరుగుతున్న వాలీబాల్ పోటీ



చింతపల్లిలో మహిళల ఖోఖో పోటీలో విజేత జట్టు

కొయ్యూరు: మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు శనివారంతో ముగిశాయి.మండల స్థాయి పోటీలను సింగవరం పోలీసు గ్రౌండ్‌లో నిర్వహించారు.మండలం నుంచి వందలాది మంది దీనిలో పాల్గొన్నారు.మొత్తం నాలుగు రోజుల పాటు మండల స్థాయి పోటీలను నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోతో పాటు పలు ఆటలను ఆడించారు. అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు. క్రీడల నిర్వాహణపై సంతృప్తి చెందారు. వాలీబాల్ ఫైనల్ కొయ్యూరు-బూదరాళ్ల జట్ల మధ్య జరిగితే బూదరాళ్ల విజయం సాధించి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. క్రికెట్‌లో ఆడాకుల-చీడిపాలెం జట్ల మధ్య జరిగిన పోరులో చీడిపాలెం విజయం సాధించింది. కబడ్డీలో ఎం.మాకవరం-రత్నంపేట జరిగిన పోరులో రత్నంపేట జట్టు విజయం సాధించింది. ఎంపీడీవో లాలం సీతయ్య మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని, యువత చదువుతో పాటు క్రీడల్లో పాల్గొవాలని కోరారు.

అడ్డతీగల: మండల స్థాయి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈనెల 18 నుంచి ప్రారంభమైన ఈ పోటీలు మూడురోజుల పాటు నిర్వహించారు.ఈ మేరకు ఆయా క్రీడల్లో విజేతలుగా నిలిచి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన జట్ల వివరాలను ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. శనివారం ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించగా పలు జట్లు విజేతలుగా నిలిచాయన్నారు. కబడ్డీలో ఎల్లవరం జట్టు, వాలీబాల్ పోటీలో ధాన్యంపాలెం జట్టు, బ్యాడ్మింటన్‌లో అడ్డతీగల జట్టు, ఖోఖోలో రాయపల్లి జట్లు విజయం సాధించినట్టు తెలిపారు. క్రికెట్ ఫైనల్స్‌లో అడ్డతీగల జట్టు విన్నర్స్‌గా నిలిచిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆయా జట్లను ఎంపీడీవో బాపన్నదొర అభినందించారు.

చింతపల్లిరూరల్: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. ఖోఖో పోటీల్లో గొందిపాకల పంచాయతీ రాసపనస గ్రామం జట్టు విజయం సాధించింది. మహిళల షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో తమ్మంగుల పంచాయతీకి చెందిన జట్టు గెలిచింది. విజేతలను పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు అభినందించారు. ఆయన మాట్లాడుతూ విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఎటపాక: మండలంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల విజేత జట్టుగా పిచుకలపాడు నిలిచింది. మండలంలో ఆడుదాం ఆంధ్రా ప్రారంభం నుండి మొత్తం 14 క్రికెట్ జట్లు పాల్గొనగా ఫైనల్‌కు గొమ్ముకొత్తగూడెం, పిచుకలపాడు జట్లు చేరుకున్నాయి. శనివారం ఎటపాకలోని డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. చివరకు పిచుకలపాడు జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. గెలుపొందిన జట్టుకు సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ వర్షా బాలకృష్ణ, పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకట్ తదితరులు అభినందనలు తెలిపారు.



ఎటపాకలో నియోజకవర్గ క్రికెట్ పోటీలకు ఎంపికైన పిచుకలపాడు జట్టు



క్రికెట్ పోటీలో విజేతగా నిలిచిన అడ్డతీగల జట్టుని అభినందిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర



వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన ధాన్యంపాలెం జట్టు

చంద్రబాబు పర్యటనతో ఒరిగేదేమీలేదు




అరకులోయలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నారావు, నేతలు

అరకులోయ రూరల్: చంద్రబాబు అరకు పర్యటనతో ఒరిగేదేమీలేదని అరకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాంగి చిన్నారావు చెప్పారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికొదిలేసిన చంద్రబాబు ఇప్పుడు ఓట్ల కోసం గిరిజనులపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. టీడీపీని గిరిజనులు నమ్మే పరిస్థితి లేదన్నారు. నాయకులు ప్రకాశరావు, ప్రసాద్, ధర్మనాయుడు, రమేష్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: అరకు పర్యటనలో చంద్రబాబు అసత్య ప్రచారాలతో ప్రభుత్వంపై , అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణపై తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ అన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వం హాయంలో ఏజెన్సీలో చేయలేని అభివృద్ధిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేడు చేసి చూపించిందన్నారు. చంద్రబాబు చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో బుద్ధి చెబుతారన్నారు.

చింతపల్లిరూరల్: చంద్రబాబు శనివారం అరకు పర్యటనలో గిరిజనులను రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడడం తగదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి అన్నారు. గతంలో గిరిజన సంపదను చంద్రబాబు, అనుయాయులు దోచుకున్నారన్నారు. జగనన్న ప్రభుత్వం ఏజెన్సీలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి టీడీపీ నాయకులు జీర్ణించలేకపోతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 9676392974, 9390991099


మండల సమావేశం రేపు

అడ్డతీగల: అడ్డతీగల మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ అధ్యక్షతన ఆరోజు ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలన్నారు. తమ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో తప్పనిసరిగా రావాలన్నారు. ఆయా అంశాలపై సభ్యుల మధ్య చర్చ నిర్వహించడంతో పాటు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తారన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

పెదబయలు: ఈఆర్‌వో ఆదేశాల మేరకు మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆదివారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తమర్భ చిరంజీవి పడాల్ చెప్పారు. ఓటర్ల జాబితా ప్రచురణ ప్రతిని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా విడుదల చేయనున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అనంతరం బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.